రమాయణం

**చిన్నప్పుడు మనకు తెలియకుండానే భలే తమాషాలు జరుగుతుండేవి. అబద్ధాలాడే అలవాటులేక.. ఉన్నదున్నట్టు మాట్లాడి, కొన్నిసార్లు ఇబ్బందుల్లో కూడా పడేది. అయినా సరే.. 'సత్యమేవ జయతే' సిద్ధాంతాన్ని.. అమ్మ మాలో అణువణువునా నింపడం వల్ల, నిష్ఠూరమైనా సరే నిజాలు నిర్భయంగా మాట్లాడే అలవాటు మాకు అబ్బింది.**

# గోకాలుడు - భూకాలుడు

ఎండకాలం సెలవుల్లో మా నానమ్మ వాళ్ల ఊరు కూనూరుకు వెళ్లేవాళ్లం. మా చిన్నాన్నలు, చిన్నమ్మలు, మేనత్తలు, వాళ్ల పిల్లలతో ఇల్లంతా గోలగోలగా ఉండేది. ఆ ఇంట్లో అందరూ సరదా మనుషులే! ఎప్పుడూ జోకులేసుకుంటూ, నిక్ నేమ్స్ పెట్టి ఏడిపిస్తూ సందడిగా ఉండేవాళ్లు. బంధువుల ఇళ్లు చాలా ఉండేవి. ఆ ఊరిలో కొన్ని చిత్రమైన క్యారెక్టర్స్ ఎదురయ్యేవి.

ఉదాహరణకు మా చుట్టాల్లో ఒకాయన.. మాటలు నోట్లోంచి వస్తే ఎక్కడ ప్రమాదం జరుగుతుందో అన్నట్టు, పెదాలు బిగించి పట్టి మాట్లాడేవాడు. ఆయనను 'పిట్ పిట్' ఒచ్చిండురా.. అనేవారు మా అన్నదమ్ములు. అలాగే మాకు పెదనాన్న వరుసయ్యే ఒకాయన పేరు నెల్లుట్ల తిరుమలరావు. అందంగా, ఒడ్డూపొడవుతో ఉండే ఆయన్ను 'ఎన్టీఆర్' అని పిలిచేవారు. ఇంకొకాయన ఎప్పుడూ నీరసంగా ఉంటూ, ప్రతిదీ నిరాశగా మాట్లాడేవాడు. ''అరె యాదగిరీ.. నేను బాయి తవ్విద్దామని ఒక్క గజం తవ్విస్తి. రెండు గజాలు తవ్విస్తి. అయినా నీళ్లే పడలేదు. ఇగ ఏం జేద్దామంటవ్?!'' అని మా చిన్నాన్నను అడిగేవాడు. ఆయనకు మా మగపిల్లల గ్యాంగ్ పెట్టిన పేరు.. 'కుయ్యు కుయ్యు'. తాతయ్య వరుసయ్యే ఒకాయన ఓసారి సర్పంచ్ ఎన్నికల్లో నిలబడ్డాడు. ఆయనకు కేటాయించిన గుర్తు రెండాకులు. ఆయనకు వీళ్లు జీవితాంతం స్థిరపరిచిన పేరు.. 'రెండాకుల తాత'.

ఆ ఊర్లోనే నానమ్మకు అత్త వరుసయ్యే ఒక పెద్దావిడ ఉండేది. వాళ్లింటి వాళ్లను బొర్రోళ్లు అనేవారు. వెనకటికి ఎవరైనా వాళ్లింటి పెద్దమనిషికి పెద్ద బొర్ర (బొజ్జ) ఉండేదో ఏమో! ఆమెకు 'ప' అక్షరం పలుకరాకపోయేది. దాని బదులు 'క' అక్షరాన్ని ఉచ్చరించేది. దాంతో ఇక ఆమె మాట్లాడుతుంటే.. ఎదురుగా విన్నవాళ్ల పరిస్థితి ఏమోగానీ, ఆ చుట్టుపక్కల ఉండి వింటున్నవాళ్లకు ఆపుకోలేనంత నవ్వు వచ్చేది.


''అండమ్మా! గింతంత చాయ్ కత్తా ఉంటె ఇస్తావు?!'' అంటూ నానమ్మ దగ్గరికి వచ్చేది. 'చాయ్ పత్తా!' అన్నమాట. ఇంకోరోజు ''అండమ్మా! ఇంట్ల కాకీ కొడి బొత్తిలకు ఐకోయింది. ఏమన్నుంటె బదులు కెడ్తవా?!'' అని ఓ చిన్న గిన్నె తీసుకుని వచ్చేది. 'కాఫీ పొడి' బదులు పెట్టమని ఆవిడ ఉద్దేశం. ''ఇవాళ ఏం ఒండినవ్ అత్తా?'' అని ఓ సారి నానమ్మ అడిగితే.. ''ఆఁ.. కూరగాయలేవి దొరుకలే! గింతంత కక్కొండి, కక్కుచారు జేసిన'' అని చెప్పింది. అది విన్నవాళ్లు ఒకటే నవ్వడం! పప్పు వండి పప్పుచారు చేసిందన్న మాట. ఇక ఆ తరువాత నానమ్మ అసలెప్పుడూ ఏం వండావని అడిగే సాహసం చేయలేదు. ఒక ఉక్కు (ఉప్పు) తప్ప ఆవిడ బదులు తీసుకెళ్లని వస్తువుండేది కాదు. నూనె బదులు తీసుకెళ్లాక తిరిగి ఇవ్వడానికొచ్చి.. ''అండమ్మా! మీ నూనె కావు దేకో.. నూనె కోస్తా!'' అనేది. నానమ్మకు ఆవిడ కోడ్ భాష పూర్తిగా వచ్చు గనుక.. వంటింట్లోకి వెళ్లి నూనె పావు తీసుకొచ్చేది.

ఓ సారి వాళ్లింటికి వెళ్తూ నానమ్మ నన్ను కూడా వెంట తీసుకెళ్లింది. నాకేమో అందరితో ఆడుకోకుండా వాళ్లింటికి ఎందుకు వెళ్లడం అనిపించింది గానీ.. నేనెప్పుడూ 'రాముడు మంచి బాలిక' అన్నట్టు సహన వినయ గుణ సంపన్నశీలిలా ఉండేదాన్ని గనుక వెళ్లాను. వాళ్ల కబుర్లు ఎంతకూ తెగవు. ఆవిడ వరంగల్ వెళ్లినప్పుడు చూసిన ఎన్టీఆర్ సినిమా 'గోకాలుడు – భూకాలుడు' కథ చెప్పడం మొదలుపెట్టింది. కాసేపయ్యాక నేను మా నానమ్మను ఇక వెళ్దామని కుట్టడం మొదలుపెట్టాను. 'కాసేపాగు!' అన్నట్టుగా నాన్నమ్మ సైగ చేయడం ఆమె గమనించింది. ''ఏందటా?! గీ కిల్లకక్కుడే నొక్కులొస్తున్నయటనా?! కది నిమిషాలు ఆగితేంది?!'' అని పరాచికమాడింది. ''చిన్నపిల్ల గద! ఆడుకుంటదేమో!'' అని సర్దిచెప్పి.. నానమ్మ నన్ను తీసుకొచ్చింది. ఇంతకూ ఆమె మాట్లాడింది డీకోడింగ్ చేస్తే.. 'ఈ పిల్లకప్పుడే నొప్పులొస్తున్నాయా?! పది నిమిషాలు ఆగితే ఏమవుతుంది?!' అని అర్థమయింది.

ఇంకోసారి ఎవరింట్లోనో భోజనాలకు పిలిస్తే అందరూ వెళ్లారట. ఈవిడ తింటూనే.. ''ఏందే క్రమీలా?! ఈ కక్కుల ఉక్కు తక్వయిందీ?!'' అన్నదట. ఆ ప్రమీల అన్నావిడ పుట్టింటివారు కూడా ఆరోజు భోజనాల బంతిలో ఉన్నారట. 'కక్కేమిటీ? ఉక్కేమిటీ?' అని వాళ్లు అయోమయంగా మొహాలు పెట్టారట. పాపం.. ఆమెకు తెలియకుండానే మాటలు అలా వచ్చేసేవి.

వీటన్నిటికీ పరాకాష్ట లాంటి సంగతి ఒకటుంది. అదేమిటంటే.. ఓసారి నేనూ, అక్కా కలిసి అక్క ఫ్రెండ్ ఇంద్రాణి వాళ్ల ఊరికి వెళ్లి, రెండ్రోజులుండి వచ్చాం. అక్కడున్నప్పుడే మమ్మల్ని వాళ్ల శేషగిరిరావు చిన్నాయన ఇంటికి తీసుకెళ్లింది ఇంద్రాణి. కాసేపు అవీ ఇవీ మాట్లాడాక.. వాళ్ల సుగుణమ్మ చిన్నమ్మ మాకు తినడానికి అటుకుల చుడువా పెట్టింది. శుభ్రంగా అవన్నీ తింటూ మాట్లాడుతున్నాం. కబుర్ల మధ్యలో మా అక్క ''మా నానమ్మ వాళ్ల ఊరిలో ఒక పెద్దామె ఉంది. ఆమెకు 'ప' అక్షరం పలకడం రాదు. దాని బదులు 'క' అంటుంది'' అని చెబుతూ.. దానివల్ల అర్థాలు మారిపోయి ఎలా నవ్వుకున్నామో సోదాహరణంగా వివరించింది. అంతా విన్నాక ఆవిడ నవ్వి.. ''ఆమె ఎవరో కాదు. మా అమ్మే! మా చిన్నప్పట్నుంచీ అంతే! కొత్తోళ్లకు అర్థం కాదు. మా తల్లిగారు కూనూరే. మేం కూడా మీకు చుట్టాలమే!'' అని నిదానంగా చెప్పింది.

అంతే! మా అక్క తల కిందికి వేసి.. ఆమె వంటింట్లోకి వెళ్లగానే అటుకుల గిన్నె అక్కడ పెట్టి ఇంటిదాకా పరుగే పరుగు! ఇలాంటి సందర్భాలలో ఎప్పుడూ నా నోట్లో నువ్వుగింజ కన్నా ఇంకేదైనా చిన్నసైజు గింజ కూడా నానదు. అలాంటిది ఆ రోజు అక్క వంతయింది. ''అయ్యో! సంధ్య గట్ల పోయిందేమే? నేనేమీ అనుకోను. రమ్మను'' అంటూ ఆవిడ ఎన్నోసార్లు అన్నా కూడా.. మొహం చెల్లక వెళ్లలేదు. ఆ తరువాత చాన్నాళ్లకు వాళ్లింటికి మళ్లీ వెళ్లామనుకోండి. అది వేరే సంగతి! ■





నెల్లుట్ల రమాదేవి
రచయిత్రి